'మిట్స్'లో బోధనాశాస్త్రం మూల్యాంకనంపై అవగాహన

మాట్లాడుతున్న ప్రొఫెసర్ నరసింహులు

ప్రజాశక్తి-మదనపల్లి : మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్, రివాంపింగ్ కరికులం, బోధనా శాస్త్రం మూల్యాంకనం అనే అంశం పై వర్క్‌షాప్ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యుజిసి హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రొఫెసర్ వై.నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యా సంస్థలలో నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ అమలు గురించి అవగాహన కల్పించడం, చర్చించడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని అన్నారు. బహుళ విభాగ విద్య, నైపుణ్య ఆధారిత అభ్యాసం, విద్యా మార్గాల్లో అవశ్యకత ప్రోత్సహించడంలో నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ ప్రాముఖ్యతను వివరించారు. పరిశ్రమ డిమాండ్లకు అనుగుణంగా పాఠ్య ప్రణాళిక పునర్నిర్మాణం, విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడానికి ఫలితాల ఆధారిత అంచనాలు ముఖ్య ఉద్దేశమని చెప్పారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ కృష్ణారావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాధన్, డాక్టర్ కమల్ బాషా, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 1న జిల్లాలో వంద శాతం సామాజిక పింఛన్ల పంపిణీని సజావుగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ హాలు నుంచి జిల్లా అధికారులు, సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారు ఇంటికి వెళ్లి పింఛను ఇవ్వాలన్నారు. పింఛనుదారు అందుబాటులో ఉండాని అవగాహన కల్గించగా టామ్ టామ్ వేయించాలన్నారు. పేదవారికి అత్యంత అవసరం ఉన్నవారికి ప్రభుత్వం భరోసా కల్పిస్తూ అందిస్తున్న సంక్షేమ కార్యక్రమం ఇది ఎవరైనా లబ్ధిదారు నుంచి డబ్బులు వసూలు చేస్తే తప్పనిసరిగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పింఛన్ పంపిణీ సందర్భంగా సిబ్బంది సత్ప్రవర్తనతో గౌరవభావంతో లబ్ధిదారులకు పింఛను అందజేయాలన్నారు. పింఛను పంపిణీపై ప్రభుత్వం ఐవిఆర్ఎస్ ద్వారా కూడా ప్రజాభిప్రాయం కూడా సేకరిస్తుందని పేర్కొన్నారు. జనవరి 31న గ్రామాలలో పింఛన్ పంపిణీపై టామ్‌టామ్ వేయించాలని సూచించారు. పింఛను పంపిణీ సందర్భంగా లబ్ధిదారు లేదా వారి కుటుంబ సభ్యుల మొబైల్ నెంబరు మ్యాప్ అయింది లేదో కూడా సరి చూసుకోవాలని తెలిపారు. ఒకవేళ లబ్ధిదారు నెంబరు కాకుండా ఇతరుల మొబైల్ నెంబరు ఉంటే అక్కడే లబ్ధిదారు లేదా వారి కుటుంబ సభ్యుల మొబైల్ నెంబరును పింఛనుకు మ్యాప్ చేయాలని చెప్పారు. ప్రస్తుతం సరైన మొబైల్ నెంబరు మ్యాప్ చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల నుంచి పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులను నాణ్యతగా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పింఛను పంపిణీలో అన్నమయ్య జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టేలా కృషి చేయాలని పేర్కొన్నారు. గృహ నిర్మాణాల లక్ష్యంలో ప్రగతి సాధించాలన్నారు. సమావేశంలో మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, ఆర్‌డిఒ శ్రీనివాసులు, డ్వామా, డిఆర్‌డిఎ, హౌసింగ్ పీడీలు వెంకటరత్నం, సత్యనారాయణ, శివయ్య, సర్వే శాఖ ఎడి భరత్ కుమార్, జిఎస్ డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ఆక్రమించుకున్న భూములు ప్రభుత్వానికి అప్పగించాలి

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

గతంలో మంత్రిగా పనిచేస్తూ ప్రభుత్వ భూములు, అడవి భూములు ఆక్రమించుకున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరిగి ఆ భూములను ప్రభుత్వానికి అప్పగించాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో అటవీ శాఖ మంత్రిగా పనిచేసిన పెద్దిరెడ్డి వేల ఎకరాల పేద ప్రజల భూములు, అటవీ భూములు అటవీ సంపదను దోచుకున్నారన్నారు. పెద్దిరెడ్డి ఆయన కుమారుడు గతంలో చేసిన అక్రమాలు అన్యాయాలు వెలుగులోకి ఇప్పుడు వాటిని బయటకు తీసే సమయం వచ్చిందన్నారు. తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, తిరుపతిలో ఎక్కడ చూసినా వేలాది ఎకరాల భూమిని దొంగ రికార్డులు సృష్టించి కబ్జా చేశారన్నారు. పెద్దిరెడ్డి భార్య పేరు మీద మదనపల్లెలో ఐదు ఎకరాల చెరువును కబ్జా చేశారని తెలిపారు. తిరుపతిలో మరొకరికి సంబంధించిన భూములు వారి చేతిలోకి తీసుకొని అధికారులను బెదిరించి నాలుగు ఎకరాలలో కళ్యాణ మండపం, 9 ఎకరాలలో విలాసవంతమైన ఇల్లు కట్టించారని పేర్కొన్నారు. తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి పరిధిలో వందలాది ఎకరాలు ట్యాంపరింగ్ చేసి దొంగ రికార్డులు సృష్టించి తమ పేరు మీద రాయించుకున్నారన్నారు. భూములను ప్రభుత్వానికి అప్ప చెప్పకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాయచోటి నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఏడు నెలల వ్యవధిలో నియోజకవర్గంలో రూ.15 కోట్లతో 300 బోర్లను, మోటర్లు ఏర్పాటు చేశామన్నారు. రూ.40 కోట్లతో 6 మండలాల్లో ఇక్కడ సిమెంట్ రోడ్డు ఎప్పుడు లేని విధంగా ఇక్కడ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇంకా కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేశామని, చేపట్టబోతున్నామని పేర్కొన్నారు. రాయచోటి మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలలో అభివృద్ధి కోసం వైసిపి ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేసే దానికి సిద్ధంగా ఉంటే మీరు ప్రతి ఒక్క ప్రతిపాదనకు అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఆరు మండలాల్లో అన్ని గ్రామాలకి నీటిని ఇచ్చే విధంగా ఈ రెండు సంవత్సరాల్లో చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

పాడి రైతుల స్థిరాభివృద్ధే లక్ష్యం

- హెరిటేజ్ వైస్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి

మహిళా రైతులకు బీమా చెక్కును అందిస్తున్న నారా భువనేశ్వరి

ప్రజాశక్తి-పీలేరు

పాడి రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయడం, వారి స్థిరాభివృద్ధిని ప్రోత్సహించడంలో హెరిటేజ్ ఫుడ్స్ అంకితభావంతో పనిచేస్తోందని ఆ సంస్థ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి తెలిపారు. బుధవారం పీలేరు పట్టణ శివారులోని శ్రీకృష్ణదేవరాయ నూనెవిత్తుల కర్మాగారం సమీపంలో ఉన్న హెరిటేజ్ ప్లాంట్‌లో జరిగిన పాడి రైతుల మహాసదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మెగా హెల్త్ క్యాంపుతో పాటు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన రైతు సదస్సులో మాట్లాడుతూ ప్రస్తుతం తమ సంస్థ రోజువారీ 9 వేలు గ్రామాల్లో 3 లక్షల మంది పాడి రైతుల నుంచి 18.5 లక్షల లీటర్ల పాలను 200 చిల్లింగ్ యూనిట్లకు చేరుతున్నాయని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలోనే 30 వేల మంది పాడి రైతుల నుంచి 2.5 లక్షల లీటర్ల పాలను జిల్లా పరిధిలోని 10 చిల్లింగ్ యూనిట్లకు అందుతున్నాయని చెప్పారు. పీలేరు చిల్లింగ్ సెంటర్‌కు ప్రస్తుతం 250 గ్రామాల నుంచి 3,000 మంది రైతులు 35 వేల లీటర్ల పాలను అందిస్తున్నారని, దీన్ని 50 వేల మంది పాడి రైతుల నుంచి 50 వేల లీటర్ల పాలను సేకరించే సామర్థ్యానికి తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రైతులను సాధికారులను చేస్తూ తాజా ఆరోగ్యకరమైన ఉత్పత్తులతో వినియోగదారులను ఆనంద పరచడానికి కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. రైతుల భద్రత కోసం గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ బీమా, సబ్సిడీపై పశువుల భీమా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పాల ఉత్పత్తిని పెంచేందుకు వీలుగా రైతులకు సబ్సిడీపై పశువుల దాణా కూడా సరఫరా చేస్తున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా పశువుల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఉచిత పశు సంవర్ధక సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 1000 ఆరోగ్య శిబిరాలు నిర్వహించి 12,000 పశువులకు చికిత్సలు అందించి, పాడి ఆవుల్లో గర్భధారణ సమస్యలు, మాస్టిటీస్ నివారణ, వ్యాక్సినేషన్ తోపాటు ముఖ్య చికిత్సలు అందించడం జరిగిందని అన్నారు. జిల్లాలో పశువులకు సరైన పోషణ అవసరమని గుర్తించి 2024 ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు 7,027 మెట్రిక్ టన్నుల మేతను సబ్సిడీపై అందించడం జరిగిందని తెలియజేశారు. రైతులు పాడి ఆవుల కొనుగోలు కోసం హెరిటేజ్ నుంచి, బ్యాంకుల ద్వారా రుణాలను కూడా ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం పాల ఉత్పత్తులను పెంచడంలో ఆసక్తి చెబుతున్న మహిళ ఆడి రైతులకు జ్ఞాపికలు అందించి అభినందించారు. అనంతరం రుణాలుగా రూ.18.35 లక్షలు, బీమా సొమ్ము రూ.21.44 లక్షలు చెక్కుల రూపంలో మహిళా పాడి రైతులకు అందించారు. పీలేరు ప్రాంతంలో పాల నాణ్యతను మెరుగుపరచడం, ఆధునిక పశుసంవర్ధక పద్ధతులను ప్రోత్సహించడానికి టెక్నో సర్వ్‌తో భాగస్వామ్యం చేసుకుంటూ తీర్మాన పత్రాలను మార్పు చేసుకున్నారు. ఈ సహకారం పశువుల ఉత్పాదకత, రైతుల ఆదాయాన్ని పెంచడంలో దోహదపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెరిటేజ్ ఫుడ్స్ ప్రతినిధులు సాయి మూర్తి, రామ్మోహన్ రావు, గోపాలకృష్ణ, అక్కిరాజు చంద్రమౌళి, చంద్రశేఖర రావు, సర్వోత్తమ రెడ్డి, డాక్టర్ దత్త చారి, డాక్టర్ వివిఎన్ రామకృష్ణలతో పాటు టెక్నో సర్వ్ ప్రతినిధి జయదీప్, భారతీయ స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ సెల్వరాజ్, హెరిటేజ్ ఉద్యోగులు, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వంతోనే సమగ్రాభివృద్ధి : సిపిఎం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రయివేట్ రంగంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామంటూ పాలకులు చెబుతున్న మాటలు ఆచరణ సాధ్యం కాదని, ఇప్పటి వరకూ ప్రపంచంలో ఎక్కడా అలా జరగలేదని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం 'జిల్లా సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు'పై పట్టణంలో సదస్సు నిర్వహించింది. పార్టీ నాయకులు హరిశర్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిధిగా హాజరైన శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, ఇందుకు జవాబుదారీ తనం, స్పష్టమైన ప్రణాళికలు, నిర్దిష్టమైన కార్యాచరణ అవసరమని అన్నారు. మన దేశానికి చెందిన పెట్టుబడిదారులతో సిఎం చంద్రబాబు దావోస్ వెళ్లి ఒప్పందాలు చేసు కోవడం విడ్డూరంగా ఉందన్నారు. పెట్టుబడులు రాష్ట్రానికి వస్తే సంతోషమేనని, గతంలో ఎన్నో సార్లు చేసుకున్న ఇటువంటి ఒప్పందాలు ఫలప్రదమైన సందర్భాలు చాలా తక్కువని గుర్తుచేశారు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెంచకుండా ఎన్ని కొత్త పరిశ్రమలు వచ్చినా ఏ ప్రయోజనం ఉండదని అన్నారు. ఈ అంశం విజన్ 2047లో చోటు చేసుకోలేదన్నారు. ప్రణాళిక రూపొందిస్తే వాస్తవికంగా ఉండాలన్నారు. ఇందులో అనుసరించిన 'వాటర్ ఫాల్' విధానం సరైంది కాదని, ఇందుకు ప్రత్యామ్నాయంగా ఎజైల్ విధానం అనుసరణీయమని చెప్పారు. 2029 నాటికి సాధించాల్సిన లక్ష్యాలను విస్మరించి 2047 రంగుల కలను సృష్టించడం ప్రజలను మభ్యపెట్టడమేనని తెలిపారు. వందల కోట్ల స్థాయిలో ఖర్చు చేసి అసంపూర్తిగా ఉన్న పనులకు నిధులు కేటాయిస్తే రాయలసీమకు సాగు నీరొస్తుందని, ఈ విషయాన్ని విస్మరించి గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ను వేల కోట్లతో చేపడతామనడం రాయలసీమ ప్రజలను మభ్యపెట్టడమేనని అన్నారు. పీలేరు, కలికిరి ప్రాంతాల్లో ఉన్న పారిశ్రామిక వాడలో ఒక్క పరిశ్రమ లేదన్నారు. కేటాయించిన భూములను ఆయా సంస్థలు బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొంది, ఎగనామం పెడుతున్నారని చెప్పారు. ప్రజల సంపద పెరగా లంటే వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని, విద్యా, వైద్యం ఉచితంగా అందించాలన్నారు. అందుకు భిన్నంగా మెడికల్ కాలేజీలను, యూనివర్సిటీలను ప్రయివేట్ పరం చేయాల నుకోవడం దుర్మార్గమైన చర్యని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌలు దారులకు ప్రభుత్వ భూములు రెండు ఎకరాలిస్తే వారికి ఏడాదికి రూ.80 వేల వరకూ ఆదా యం వచ్చే అవకాశం ఉందన్నారు. కడప -బెంగళూరు రైల్వే లైన్ పూర్తి చేయా లని, హంద్రీనీవా కాలువలు వెడల్పు చేసి లైనింగ్ పనులు చేపట్టాలని, నికర జలాలు కేటాయించాలని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చెయ్యాడం వంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ ప్రణాళికలో ప్రజలు, వివిధ వర్గాలు, సంఘాల అభిప్రాయాలు తీసుకునేం దుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ రెడ్డి, రఘునాథ్, రాజమ్మ, రామకృష్ణ, నాగరాజు, రెడ్డికుమారి, భాగ్య, గిరిపాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సెలవులు ఇవ్వాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సెలవులు ఇవ్వాలి శ్రమ దోపిడీని ఆపకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చలపతినాయుడు, సాంబశివ నాయక్ హెచ్చరించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన మదనపల్లె మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కార్మికుల సమస్యలపై వైస్ ఛైర్మన్ జింకా వెంకటాచలపతి చర్చించడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. కార్మికులకు సెలవులు ఇవ్వకుండా వేధించడమే కాకుండా అనివార్య కారణాల విధులకు గౌర్హాజరైతే వేతనం నుండి తిరిగి వసూళ్లకు పాల్పడుతూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయకపోతే సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని స్పష్టం హెచ్చరించారు. సమావేశంలో ట్రెజరర్ రామకృష్ణ రాజు, సభ్యులు అరవింద్, గోపాల్, చంద్ర, శంకర్ నాయక్, కృష్ణప్ప, బాలకృష్ణ, చిన్న రెడ్డప్ప, శ్రీరాములు, మునిస్వామి, మున్సిపల్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

సభలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఆఫీసర్స్ క్లబ్, బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణంలోని సిటియం రోడ్డు ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణం లో నిర్వహించిన వైద్య శిబిరంలో బెంగుళూరు ఫోర్టిస్ ఆస్పత్రి వైద్యులు శ్రీకాంత్ రెడ్డి, నవీన్ గౌడ, సూరజ్ లు వైద్య చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆఫీసర్స్ క్లబ్ సెక్రటరీ నాగసుబ్బారెడ్డి, బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ షేక్ మహమ్మద్ బాషాలు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ప్రజాపయోగ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ డిఎస్‌పి సుభాష్ అధ్యక్షులు వ్యవరించగా, రిటైర్డ్ అగ్రికల్చర్ అధికారి శివకుమార్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఫోర్టిస్ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ సయ్యద్ జమ్రుత్ బాష క్రియాశీలకంగా వ్యవహరించారు.

అల్లర్లకు మా కళాశాల విద్యార్థులు దూరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : గొడవలు, అల్లర్లకు తమ కళాశాల విద్యార్థులు దూరంగా ఉంటారని శ్రీవెంకటరెడ్డి సిద్దార్థ జూనియర్ కళాశాల చైర్మన్ అండ్ కరస్పాండెంట్ ఇ.వెంకటరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోఎఒ హేమంత్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం పట్టణంలోని కొంతమంది విద్యార్థుల మధ్య గొడవ జరిగిన విషయం వాస్తవమేనని అన్నారు. అందులో మా కళాశాల విద్యార్థులు లేరన్నారు. విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నారని స్పష్టం చేశారు. కళాశాల నుంచి విద్యార్థులు బయటికి వెళ్లాలంటే తల్లిదండ్రుల చరవాణికి ఒటిపి పంపుతామని తెలిపారు.

కార్పొరేటుకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లో వసతులు

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా అన్ని వసతులు ఉన్నాయని విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 92వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత నిస్తున్నారన్నారు. విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు బాగా చదివి మంచి ఉద్యోగాలు సంపాదించాలని ఎన్నో ఆశలు పెట్టుకుంటారని వారి ఆశలు నిరాశ చేయకుండా విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణుల కావాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో మంచి అనుభవజ్ఞులై న అధ్యాపకులు ఉన్నారని విద్యార్థులకు ఎటువంటి అనుమానాలు ఉన్న వెంటనే అధ్యాపకులకు తెలియజేసి డౌట్ క్లియర్ చేసుకోవాలన్నారు.మన ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఇంజనీరింగ్, ఎంసెట్ లలో మంచి ర్యాంకులు సాధించి వివిధ హెూదాలలో ఉన్నారని మీరు కూడా బాగా చదివి మంచి ఉద్యోగాలు పొంది అన్నమయ్య జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమానికి ముందు కళాశాల యాజమాన్యం మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మిలటరీ స్కూల్‌కు ఎంపికవ్వడం అభినందనీయం

రాష్ట్రీయ మిలటరీ స్కూల్‌కు ఎంపికైన మురళి సైనిక్ అండ్ నవోదయ కోచింగ్ సెంటర్ విద్యార్థులను రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభినందించారు. దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్రీయ మిలటరీ స్కూల్స్ ప్రవేశానికి జరిగిన పరీక్షల ఫలితాలను సోమవారం ఎన్‌టిఎ విడుదల చేసింది. ఈ ఫలితాలలో దేశవ్యాప్తంగా ఒపెన్ కేటగిరీలో పట్టణానికి చెందిన మురళి కోచింగ్ సెంటర్ విద్యార్థులు నితిన్, రెడ్డి రాకేష్ ఎంపిక కావడం పట్ల మంత్రి వరాంప్రసాద్ రెడ్డి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను, కోచింగ్ సెంటర్ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ఐదు రాష్ట్రీయ మిలటరీ పాఠశాలల్లో ప్రవేశం కోసం జరిగిన పోటీ పరీక్షల్లో రాయచోటి పట్టణానికి చెందిన మురళి కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఎంపిక కావడం చాలా గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సురేష్ రెడ్డి,విజయసారథి రాజు, ఉపాధ్యాయులు కులశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయమా? : 'చమర్తి'

బాధితులతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సామాన్య ప్రజలు, టిడిపి కార్యకర్తలంటే రాజంపేట తహసిల్దార్‌కు నిబంధనలు గుర్తొస్తాయని, అందుకే పేదల నోటి కాడ కూడు తీస్తూ చిన్న చిన్న రైతులను ఎటువంటి నోటీసులు లేకుండా వారు సాగు చేసుకునే పంటలను ధ్వంసం చేస్తున్నారని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాజంపేట మండలం శేషమాంబపురంలో టిడిపి కార్యకర్త సంగరాజు వెంకటసుబ్బమ్మ, వెంకటేశ్వరరాజు సాగు చేసుకుంటున్న భూమిని పరిశీలించారు. 133 సర్వేనెంబర్ లోని 3.09 సెంట్ల పట్టా భూమి పక్కన ఎవరికి అడ్డంకులు లేని 60 సెంట్లు భూమిని చదును చేసుకొని సాగు చేసుకుంటుండగా ఆ భూమి నందు 800 బొప్పాయి మొక్కలను, ఫినిషింగ్ చేసుకున్న 40 స్తంభాలను ఎటువంటి సమాచారం లేకుండా, మండల రెవిన్యూ అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తహశీల్దార్ సిబ్బందితో వెళ్లి ధ్వంసం చేయడంపై చమర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో భారీగా భూములు దోచుకు తిన్న బడా నాయకులు జోలికి వెళ్లకుండా, ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోకుండా, కళ్ళ ముందరే కబ్జాలు కనిపిస్తున్నా చర్యలు తీసుకునేందుకు తహసిల్దార్ కు తీరిక లేదని, కేవలం తమ సొంత భూమిలో పక్కన కొంచెం సాగు చేసుకునేందుకు సాగు చేసుకున్న భూమితో పాటు తమ పట్టా భూమిలో ఉన్న స్తంభాలన్నిటిని ధ్వంసం చేయడం చూస్తుంటే ఒక పార్టీకి ఏజెంట్‌గా పనిచేస్తున్నట్లు అర్థమవుతుందని అన్నారు. గతంలో పనిచేసిన చోట కూడా ఇలాగే పేదల పొట్ట కొట్టి పెద్దలకు దోచిపెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయని తహశీల్దార్ అవినీతిని బట్ట బయలు చేస్తామని అన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, రాజంపేట మండల రూరల్ టిడిపి అధ్యక్షులు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, ఉపాధ్యక్షులు సతీష్ రాజు, మాజీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, శేషమాంబపురం టిడిపి నాయకులు సూర్యనారాయణ రాజు, రవీంద్ర రాజు పాల్గొన్నారు.

అబ్దుల్‌ఖాదర్‌ను సన్మానిస్తున్న విభిన్న ప్రతిభావంతులు

విభిన్న ప్రతిభావంతులకు డాక్టరేట్ రావడం గర్వకారణం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విభిన్న ప్రతిభావంతుడైన అబ్దుల్ ఖాదర్‌కు హైదరాబాద్ లోని మినిస్ట్రీస్ ఫ్రెండ్‌షిప్ వారి ఆధ్వర్యంలో డాక్టరేట్ రావడం గర్వకారణమని విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం రాజంపేట మండల ఉపాధ్యక్షులు ఖాదర్ బాషా తెలిపారు. మన్నూరులోని విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం కార్యాలయంలో బుధవారం అబ్దుల్ ఖాదర్‌కు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని అవార్డులు పొంది విభిన్న ప్రతిభావంతులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యదర్శి వెంకటప్రసాద్ మాట్లాడుతూ అబ్దుల్ ఖాదర్ విభిన్న ప్రతిభావంతులకు ఒక దిక్సూచిగా నిలవాలని, రాబోయే రోజుల్లో మేము చేసే సేవా కార్యక్రమాలకు ఈ అవార్డు మాకు ఎంతో ఉత్సాహాన్ని నింపుతుందని అన్నారు. సన్మాన కార్యక్రమంలో పుల్లంపేట అధ్యక్షులు డాక్టర్ మల్లు సుబ్బనరసారెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులు, సుధ, సభ్యులు మౌలా, అమీర్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చిత్తూరు పోక్సో కోర్టులో మదనపల్లెకు చెందిన ఇద్దరి యువకులకు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. ఎపిపి శైలజ కథనం మేరకు.. మదనపల్లెకు చెందిన చరణ్, అహ్మద్ స్థానికంగా ఉన్న ఓ మైనర్ బాలికను 2022 ఫిబ్రవరి 22 లో కిడ్నాప్ చేశారు. అప్పటి టూటౌన్ పోలీసులు ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేయగా, కేసు కోర్టులో విచారణ కొనసాగింది. నిధితులపై నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతి ముద్దాయిలకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఇద్దరికి రూ. 4వేలు అపరాధం చెల్లించాలని తీర్పులో వెల్లడించినట్లు మదనపల్లి డిఎస్పి కొండయ్య నాయుడు, టూ టౌన్ సిఐ రామచంద్ర తెలిపారు.

'పల్లా'ను కలిసిన 'సుగవాసి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌యాదవ్‌ను బుధవారం అమరావతిలోని సచివాలయంలో రాజంపేట నియోజకవర్గ టిడిపి నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజంపేట నియోజకవర్గంలో చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై చర్చించి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు సుగవాసి తెలిపారు. ఇందుకు పల్లా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిపారు.

పల్లా శ్రీనివాస్‌తో బాలసుబ్రమణ్యం

తహశీల్దార్‌ను సన్మానిస్తున్న సర్పంచ్, ఉద్యోగులు

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్, జెసి ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ చేతుల మీదుగా ఉత్తమ సేవ పురస్కారాన్ని అందుకున్న తహశీల్దార్ కె.ధనుంజయలును మంగళవారం మండలంలోని చౌక దుకాణాల డీలర్లు సన్మానించారు. బుధ వారం రెడ్డివారిపల్లి సచివాలయంలో సర్పంచ్ నూతన కాలువ రెడ్డమ్మ నరేంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు గాయత్రి, నాగభూషణం, విఆర్ఒలు హేమాంబర్‌రెడ్డి, నాగరాజు, సచివాలయ సిబ్బంది దుశ్శాలువాతో సత్కరించగా, రెవెన్యూ కార్యాలయంలో వైస్ ఎంపిపి జయప్రకాశ్‌రెడ్డి సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహశీల్దార్ ప్రజాసేవపై నిబద్ధతతో, రైతుల భూ సమస్యల పరిష్కారంపై అంకితభావంతో పనిచేస్తుండటంతో ఉత్తమ తహశీల్దార్‌గా ప్రశంసలు అందుకున్నారని అన్నారు. భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ ఉత్తమ సేవా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉన్నా, ఇది మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. ప్రతి ఉద్యోగి తన విధివిధానాలపై అవగాహన కలిగి ఉండి, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తే గుర్తింపు అనేది తానంతట అదే వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు ఎన్నో ఆశలతో ప్రజలు వస్తుంటారని, వారిని స్నేహపూర్వకంగా పలకరిస్తూ, వారి సమస్యలను పరిష్కరిస్తే వారి ఆశీస్సులు జీవితాంతం ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, విఆర్ఎ చిన్న రెడ్డప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యం పైన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి. రఘురామయ్య మాట్లాడుతూ సమాజంలో ప్రతి వ్యక్తి మానసిక రుగ్మతులతో బాధపడుతున్న తరుణంలో ముఖ్యంగా విద్యార్థులు ఈ మానసిక సమస్యలకు దారితీసి ఆత్మహత్య చేసుకోవడం జరుగుతుందన్నారు. మానసిక సమస్యలకు పరిష్కార మార్గాలు అనేకం ఉన్నాయని, ప్రతి వ్యక్తి సమాజంలో సంఘంలో మనుషులతో కలిసి జీవించాలని అదే సగం ఆరోగ్యాన్ని ఇస్తుందని అన్నారు. విద్యార్థులు రోజువారీగా ప్రణాళికతో తమ వృత్తి, కుటుంబం వ్యక్తిగత అవసరాలు, నిద్ర అన్నింటిని సమపాళ్లల్లో అనుసరిస్తే మంచి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. మానసిక ఒత్తిడిని జయిస్తే మనిషి జీవితంలో ఆదర్శవంతంగా నిలుస్తారని, సమ యపాలన, కష్టపడే తత్వం అలవర్చుకోవాలని సూచించారు. మూఢన మ్మకాలకు దూరంగా ఉండాలని ఇవన్ని అలవ ర్చుకోవాలంటే జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. రోజువారీగా కొత్త విషయాలు తెలుసుకుంటే జ్ఞానం సమకూర్చుందని చెప్పారు. అనంతరం మరో ప్రోగ్రామ్ ఆఫీసర్ భాస్కర్ మాట్లాడుతూ నిరాశ, అసూయ, ద్వేషం, స్వార్థం వంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

సోమశిల వెనుక జలాల్లోకి..

19 లక్షల చేపపిల్లలు విడుదల

ప్రజాశక్తి-నందలూరు

సోమశిల వెనుక జలాల్లోకి 19 లక్షల చేపపిల్లలను విడుదల చేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి సుస్మిత పేర్కొన్నారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలలోని మత్స్య క్షేత్రాల నుంచి చేప పిల్లలను సేకరించి మదన మోహనపురం గ్రామ సర్పంచ్ చుక్క నిర్మల, టిడిపి నాయకులు చుక్క యానాది, ఉపసర్పంచ్ పుల్లయ్య చేతులు మీదుగా మండలంలోని కోనాపురం సోమశిల వెనక జలాల విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్తక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై, విఆర్ఒ శివప్రసాద్, మత్స్యశాఖ అధికారులు వెంకటరమణ, రామ మోహన్, సుబ్బ నరసయ్య, మోహన్ కృష్ణ, మురళి, బ్రహ్మానందరెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

దుకాణాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని జ్యోతి చౌక్‌లో పూల దుకాణాలు ఏర్పాటు చేసేందుకు కొందరు సిద్ధం చేస్తుండగా నగర పంచాయతీ కమిషనర్ జివి.పల్లవి ఆక్రమణకు గురవుతున్న చోటుకి చేరుకొని ఆక్రమాలకు పాల్పడితే సహించేది లేదని తేల్చి చెప్పారు. ఏవైనా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలంటే నగర పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

విద్యార్థుల క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల కలలు సహకారం చేయాలని మల్లయ్య కొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక హై స్కూల్లో తన సొంత నిధులతో వేయించిన మంచినీటి పైప్ లైన్ ను ఆయన ప్రారంభించారు. తన కుమారుడు మద్దిరెడ్డి కుమారుడు గౌతమ్ రెడ్డి జన్మదిన సందర్భంగా వారు చదువుకున్న పాఠశాలకు మంచినీటి పైప్‌లైన్ వేయిస్తానని హామీ ఇచ్చారు. హామీ మేరపు పాఠశాల తమ సొంత నిధులు రూ.50వేల లతో మంచినీటి పైప్‌లైన్ వేయించి బుధవారం ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎస్ఎంసి చైర్మన్ శివకుమార్, హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మద్దిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సుబ్రహ్మణ్యం, కురవంక సర్పంచ్ చలపతి, వైఎస్ఆర్సిపి కరీం, శేఖర్ ఒడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్.ఓ.సి.నెం. 1146/A1/2011 తేది: .01.2025

మదనపల్లె పురపాలక సంఘము

బహిరంగ వేలము ప్రకటన

మదనపల్లె పురపాలక సంఘమునకు చెందిన వివిధ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లలోని దిగువ మరియు మొదటి అంతస్తు నందుగల షాపు రూములకు 3 సం॥ కాలము బాడుగకు ఇచ్చుటకు గాను ది: 07.02.2025వ తేది ఉదయం గం॥11.00లకు కమిషనరు గారిచే కాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును.

వ.సం.	ఏరియా/ కాంప్లెక్స్	మొత్తం	ఖాళీగా ఉన్న షాపురూముల నెంబర్లు
1.	జే.కే.వీధి	10	18, 27, 28A, 29, 29A, 30, 34, 35, 39, 44
2.	ముగ్గురాళ్ళ వంక	17	06(SC), 30, 31, 34, 37, 38, 41, 43, 44, 45, 51,52(SC),53,56(PH), 57, 63, 64
3.	చిత్తూరు బస్టాండు	17	9(PH),10,11,15,16(SC), 18,19,20,22 (SC), 24,26,27(ST),28,29,30,33(PH), Toilet rooms
4.	బెంగుళూరు బస్టాండు	09	02(ST), 15(SC),24,28,32(SC),35A, 36A, 40(SC), 43
5.	కో–ఆఫ్ కాలనీ	06	5(SC), 06,08,09(ST), 10,11(SC)
6.	సుబాష్ రోడ్డు	01	1
7.	కొత్తగా నిర్మించిన చిత్తూరు బస్టాండ్	02	02, 03
8.	అబ్దుల్ కలాం ఆజాద్	01	02
9.	ఆంధ్రకేసరి విపణి కల్ప	02	03, 06
10.	డి.వి.మార్కెట్టు	01	06
	మొత్తం	66	

గ్రౌండ్ ఫ్లోర్ నందు వున్న షాపు రూములకు రూ. 1,00,000/–లతో, మొదటి అంతస్తు నందు వున్న షాపు రూములకు రూ. 50,000/–లతో సాల్వెన్సీ సర్టిఫికేట్ లేదా తత్సమానమైన పైకముతో కమీషనరు పేరిట డి.డి. పాట కాలమందు చెల్లించవలెను. మరియు బహిరంగ వేలము డిపాజిట్ క్రింద గ్రౌండ్ ఫ్లోర్ నందు వున్న షాపు రూములకు రూ. 50,000/–లను పాట కాలమందు చెల్లించవలెను.

ఇతర వివరములను కార్యాలయ పని దినములలో రెవెన్యూ విభాగము నందు అడిగి తెలుసుకొనవలెను.

కమిషనరు
మదనపల్లె పురపాలక సంఘము

మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలి

- ఆర్‌టిసి బస్టాండ్‌లో పనిచేయని బోరు
- మరుగుదొడ్లకు తాళాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టని సంబంధిత అధికారులు

మూతపడిన మరుగుదొడ్లు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని ఆర్‌టిసి బస్టాండ్‌లో నీటి బోరు చెడిపోవడంతో మరుగుదొడ్లకు తాళాలు వేశారు. మండలంలోని 17 గ్రామాలోల 50 వేల జనాభా ఉన్నారు. నిత్యం ఉద్యోగులు, విద్యార్థులు, కూలీలు, రైతులు బస్టాండ్ నుంచే ప్రయాణాలు సాగిస్తుంటారు. బస్టాండ్‌లోని నీటి బోరు మోటర్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాలిపోవడంతో నీటి సౌకర్యం లేకపోవడంతో మరుగుదొడ్లకు తాళాలు వేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, మహిళా కండక్టర్ల పరిస్థితి దారుణంగా ఉంది. మదనపల్లి డిపో, రాయచోటి, కదిరి డిపోలో నుంచి మహిళా కండక్టర్లు ఎక్కువమంది ఉన్నారు. మండల కేంద్రమైన ఆర్‌టిసి బస్టాండ్ లోనే మహిళలకు మరుగుదొడ్లు పనిచేయకపోవడం శోచనీయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురుషులైతే ఏదో విధంగా కాలకృత్యాలు తీర్చుకుంటారని మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పట్టణంలోని గేటు నుండి బస్టాండ్ వరకు రెండు వైపులా రోడ్డుపై పబ్లిక్ మూత్రశాలలు, మరుగుదొడ్లు గాని ఎక్కడా లేవని ఇక మహిళలు ఎక్కడ కాలకృత్యాలు తీర్చుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ సమీపంలోని కూరగాయలు సంతలో ఎక్కువ మంది మహిళలు మరుగుదొడ్లను వినియోగించుకుంటున్నామని మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీటిబోరు మోటార్‌కు మరమ్మతులు చేయించి నీటి సౌకర్యం కల్పించి మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి : డిఎల్‌డిఒ

సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అమర్నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని రాచవేటివారిపల్లె, రెడ్డివారిపల్లె గ్రామ సచివాలయాలను మదనపల్లె డివిజన్ లెవెల్ డెవలప్మెంట్ ఆఫీసర్ అమర్నాథ్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సమయపాలన తప్పక పాటించాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో సమయానికి హాజరు వేయాలన్నారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్‌లను, పలు రికార్డులను పరిశీలించారు. గ్రామ సచివాలయాల్లో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పనిచేస్తున్నారని, ప్రతి ఉద్యోగి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించాలని ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రతినెల 1వ తేదీన ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లను ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయాలని తెలిపారు. ఉన్నతాధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ గ్రామ సచివాలయాలను ఎప్పుడైనా సందర్శించే అవకాశం ఉందని అన్నారు. ఉద్యోగులు విధిగా తమ విధులను నిర్వర్తించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులపై తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. ముందస్తు సమాచారం కానీ, పై అధికారుల అనుమతి కానీ లేకుండా విధులకు గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో తాగునీటి సరఫరా, పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నూతన కాల్వ రెడ్డమ్మ నరేంద్ర రెడ్డి, పంచాయితీ కార్యదర్శులు మారెప్ప, గాయత్రి, నాగభూషణం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నప్స్ యాప్‌పై అవగాహన కలిగించాలి : డిఎఒ

ప్రజాశక్తి-రామాపురం

జాతీయ చీడపీడల నిఘా వ్యవస్థ (నప్స్) యాప్‌పై రైతులకు అవగాహన కలిగించాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు, నల్లగుట్టపల్లి రైతు సేవా కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ చీడ పీడల నిఘా వ్యవస్థ యాప్‌తో పంటలు ఆశించిన చీడపీడల ఉధృతి, నివారణకు తీసుకోవలసిన చర్యలు తెలుసుకోవచ్చుని అన్నారు. రైతులకు ఈ యాప్ గురించి అవగాహన కలిగించాలని పేర్కొన్నారు. ఇ-క్రాప్‌లో నమోదు చేసిన ప్రతి పంటకు రైతు ఇకెవైసి తప్పనిసరి చేయించాలని రైతు సేవ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం చిట్లూరు గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి కంది పంటను పరిశీలించి దిగుబడి అంచనా వేసి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. డిఎఒ వెంట లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు యం.జయరాణి, మండల వ్యవసాయ అధికారి వై.నాగమణి, రెండు గ్రామాల రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కందిపంటను పరిశీలిస్తున్న డిఎఒ చంద్రానాయక్

నియోజకవర్గంలో ప్రతి సమస్యను పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ప్రజాశక్తి-పుల్లంపేట

గత వైసిపి ప్రభుత్వంలో చేసిన అరాచకాలన్నిటిని అంతమొందించి నియోజకవర్గంలోని ప్రతి సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అరవశ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి ముద్దా వెంకటసుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో యుద్ధ ప్రాతిపదికన పరిష్కారమయ్యే పనులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఏదైనా సమస్యతో వస్తే కార్యాలయాలు చుట్టు తిప్పించుకోకుండా త్వరితగతిన పనులు చేసి పెట్టాలన్నారు. రెజల్యూషన్ ప్రకారం ఆయా పనులకు నిధులు విడుదల చేయాలని ఇందుకు పార్టీలతో సంబంధం లేకుండా పార్టీలకు అతీతంగా పని చేయాలన్నారు. స్పందించిన ఎంపిపి వెంకటసుబ్బారెడ్డి వైసిపి ప్రభుత్వం ఎటువంటి అరాచకాలకు పాల్పడలేదని ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి నేటి వరకు ఒక్క పుల్లంపేట మండలంలోని 420 ఎకరాలు భూమి అన్యాక్రాంతమైందని అన్నారు. తమ హయాంలో ఒక్క సెంటు భూమి సైతం తాము అన్యాయానికి పాల్పడలేదని అలా అన్యాయానికి పాల్పడినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తామని అన్నారు. పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పుల్లంపేట శ్మశాన భూమి ఆక్రమించి ప్రహరీ ధ్వంసం చేశారని ధ్వంసం చేసి రెండు నెలలు పూర్తవుతున్న ఇంతవరకు దానిమీద ఎటువంటి చర్యలు తీసుకోలేదని తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే కేసు ఎందుకు నమోదు చేయలేదని ఎస్ఐని ప్రశ్నించగా తమకు తహశీల్దార్ నుంచి రెవిన్యూ రికార్డులు అందలేదని ఆయన సమాధానం ఇచ్చారు. ఆర్ఐని ప్రశ్నించగా కలెక్టర్ కు నివేదించామని సమాధానం ఇచ్చారు. దీనిపై చర్యలు తీసుకొని న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంఇఒనాగా తిరుమల్ రావు మాట్లాడుతూ మండలంలో కొత్తపేట, పుల్లంపేట మెయిన్ స్కూల్ లను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా అప్ గ్రేడ్ చేయడానికి నివేదికలు పంపించామని తెలిపారు. పశు వైద్యాధికారి మాట్లాడుతూ మండలంలో నవంబర్ 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు పశు గణన జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి ప్రజల వద్ద అర్జీలు స్వీకరించి సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో డిఎల్‌డిఒ నరసింహమూర్తి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వరప్రసాద్, ఆర్ఐ సుశీల్ కుమార్, ఎఒ శ్రీధర్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి ముత్తయ్య, అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకారం ఇవ్వాలి : ఎంపిడిఒ

గాలివీడు : మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు అధికారులు అందరూ సహకారం అంది వాళ్ళని ఎంపిడిఒ సిఎ.జవహర్ బాబు పేర్కొన్నారు. ఎంపిడిఒ సభా భవనంలో ఎంపిపి జల్లా ప్రభావతమ్మ అధ్యక్షతన 13వ మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రఫిక్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో స్కానింగ్ మిషన్ కలదని ప్రతి నెల 9వ తేదీ గర్భిణీ స్త్రీలకు నిర్వహించబడునని పేర్కొన్నారు. సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కింద అందిస్తున్న వైద్యసేవలు అందుబాటు ఉన్నాయా లేదా అని నూలివీడు వైద్యాధికారి ని అడిగారు. వైద్యాధికారి స్రవంతి రెడ్డి మాట్లాడుతూ దీనికి సంబంధించిన సమాచారం మాకు తెలియదని పై అధికారుల ను అడిగి సమాచారం తెలుసుకొని సర్పంచులకు, ఎంపిటిసిలకు తెలియజేస్తామని తెలిపారు. పశుసంవర్ధక శాఖ డాక్టర్ హేమ సుందర్ రెడ్డి మాట్లాడుతూ మినీ గోకులాలు నిర్మాణం అన్ని పూర్తి దశలో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటరమణారెడ్డి, తాసిల్దార్ జె .భాగ్యలత, ఇఒపిఆర్‌డి శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ జెఇ కృష్ణ మండల సమావేశాలకురాని ఆర్‌టిసి, ఆర్అండ్‌బి, ట్రాన్స్‌కో, ఇరిగేషన్ అధికారులపై కలెక్టర్‌కు సమాచారం అందివ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపిటిసిలు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు , సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన మనందరి బాధ్యత

ప్రజాశక్తి-రామాపురం

బాల్య వివాహాల నిర్మూలన మనందరి బాధ్యత అని శ్రీ బాలాజీ విద్యా నికేతన్ స్కూల్‌కరస్పాండెంట్ సయ్యద్ రెహునమాబేగం పేర్కొ న్నారు. మండలంలోని గువ్వలచెరువు శ్రీ బాలాజీ విద్యానికేతన్ స్కూల్ లో బుధ వారం జరిగిన బాల్య వివాహాల నిర్మూలనపై మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా పోలీస్ సహకారంతోజరిగిన అవగాహన సదస్సు లో ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆడపిల్లలకు18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 ఏళ్ళు నిండిన తర్వాత వివాహం జరిపించాలన్నారు. చిన్న వయ సులో వివాహం చేయడం వల్ల ఆడపిల్లలు శారీరంగా, మానసికంగా నష్టపోతారని అన్నారు. సామాజిక ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తల్లి దండ్రులు చిన్న తనంలోనే వివాహాలు చేస్తుంటారని, బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం అన్నారు. గ్రామాలలో బాల్యం వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే మాతా శిశు సంరక్షణ శాఖ వారికి తెలపాని సూచించారు. బాలల సంరక్షణ కోసం 1098 టీం చేస్తున్న సేవలను వివరించారు. బాల సంక్షేమం కోసం ప్రభుత్వాలు, బాలికల విద్య రక్షణ అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతోందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ షేక్‌దర్బార్‌షా, స్కూల్ ఇన్‌ఛార్జి మహేష్, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, శివశంకర్, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎపిని అప్పుల్లోకి నెట్టిన ఘనత వైసిపిదే : 'దాసరిపల్లి'

ప్రజాశక్తి-ములకలచెరువు : ఎపిని అప్పుల్లోకి నెట్టిన ఘనత వైసిపిదేనని తంబళ్లపల్లె టిడిపి ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. ఆ గత ప్రభుత్వంలో జగన్ సర్కారు భారీగా తమ పథకాలను అమలు చేసేందుకు లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. దాని భారం వాటి వడ్డీలు ఇప్పుడు కూటమి ప్రభుత్వం చెల్లించవలసి వస్తుందన్నారు. ప్రస్తుతం అప్పులు కూడా పుట్టని స్థితికి జగన్ తీసుక వచ్చారని ఆరోపిం చారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు, ఇరిగేషన్ కాంట్రాక్టులకు బకాయిలు, గృహ నిర్మాణం బకాయిలు, ఉపాధి హామీ పథకాలు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయని అన్నారు. గనులు, తవ్వకాలు, సోలార్ అనుమతులు ఇలా ప్రతి దాంట్లో అశ్రితపక్షపాతానికి వడిగట్టి లక్షల కోట్లు సంపాదించుకున్నారు. సమావేశంలో రాష్ట్ర బిసి అధికార ప్రతినిధి త్యాగరాజు, నాయకులు సురేష్, కె.వి రమణ, సివి నరసింహులు, చంద్రమోహన్ రెడ్డి, గంగాదేవి కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

పశు గ్రాస బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ గోపీనాథ్‌రెడ్డి

పంచాయతీ అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని తాటికుంటపల్లి పంచాయతీ అభివృద్ధే తన ధ్యేయమని సర్పంచ్ గోపీనాథ్‌రెడ్డి అన్నారు. బుధ వారం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించి బ్యానర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ మండలంలో భూ సర్వే మొదలవుతుందని, రైతులు సద్వినియోగం చేసుకునేలా సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలన్నారు. భూ రీ సర్వే పై అవగాహన కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతి రైతు రీ సర్వేకు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువులు, జీవాలు, ఆరోగ్యంగా పది కాలాలపాటు పదిలంగా ఉండాలంటే పశు గ్రాసాలే కీలకమని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రాజశేఖర్, ఎహెచ్ఎ ఆంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలకు పోలీసు నెంబర్ తప్పనిసరి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో తిరుగుతున్న ఆటోలు పోలీసు నెంబర్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. భద్రత మాసోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మండలంలో తిరుగుతున్న ఆటోలకు పోలీసు సీరియల్ నెంబర్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఆటో డ్రైవర్లకు మంచి ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. ఆటో సమాచారం పోలీసు స్టేషన్‌లో ఉంటుందన్నారు మండల పరిధిలో ఉన్న ప్రతి ఆటో పోలీసు నెంబర్ కలిగి ఉండాలని తెలిపారు. వాహన తనిఖీలలో పోలీసు నంబర్ లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల పరిధిలోని రాచవేటివారిపల్లె పంచాయతీలోని దిగువ మాచిరెడ్డిగారిపల్లెలో గురువారం పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ కె.ధనుంజయులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెల 30న తేదీన క్రమ పద్ధతిలో మండలంలోని ఒక గ్రామంలో పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవ సమావేశాన్ని నిర్వహిస్తూ, వారి సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నామని అన్నారు. అన్ని శాఖల మండల అధికారులు, నాయకులు సమావేశానికి హాజరుకావాలన్నారు.

విభిన్న ప్రతిభావంతుల పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని బెడ్ పై ఉన్న వికలాంగ పెన్షన్లను ఎంపిడిఒ భానుమూర్తిరావు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని పల్లవోలు, చీకటిపల్లి, మేడికుర్తి, మర్రికుంటపల్లి, పత్తేగడ, గ్రామాలలో దాదాపు 43 మందిని తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ప్రత్యేక బృందంపాల్గొన్నారు.

ఉద్యోగులను తొలగించడం దారుణం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఎపిఎండిసి సంస్థ అభివృద్ధికి ఇళ్లు, భూములు ఇచ్చి నిర్వాసితులైన పదిమంది ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్లో గత మూడు సంవత్సరాల నుంచి స్కావెంజర్స్, హౌస్ కీపింగ్, కేర్ టేకర్, గార్డెన్, చైల్డ్ కేర్, మధ్యాహ్న భోజనం మొదలగు పనులలో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించడం దారుణమని రైల్వే కోడూరు అభివృద్ధి పోరాట కమిటీ కన్వీనర్ జాన్‌ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం శిబిరంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన తెలంగాణ సెటిలర్ ఉషోదయ ఎడ్యుకేషన్ సొసైటీ, ఎండి మహేష్ ఆదేశాలతో ఎటువంటి నోటీసు లేకుండా మూడు నెలలుగా కార్మికుల చేత పనిచేయుచుకొని జీతాలు అడిగితే పనిలోకి అవసరం లేదని పాతవారితో పనులు చేయించుకుంటామని చెప్పడం దుర్మార్గమన్నారు. అభివృద్ధి అంటే ఉద్యోగులను తొలగించడం కాదని ఎపిఎండిసి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా గత ప్రభుత్వాలు ఇచ్చిన ఉద్యోగాలను తొలగించి నిరుద్యోగులుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి, ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ యాజమాన్యానికి తొలగించిన సిబ్బందిని విధుల్లోకి తీసుకొని జీతం చెల్లించ మని చెప్పారని పేర్కొన్నారు. అయినా కూడా వారు లెక్కచేయడం లేదని పేర్కొన్నారు. విధి లేని పరిస్థితులో గత మూడు రోజుల నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారని తెలిపారు. ఈ నిరాహార దీక్షలో సంఘీభావంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, మండల కార్యదర్శి నాగిపోగు పెంచలయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల్ నాయకులు కేశవులు, లక్ష్మీ, చిట్టెమ్మ పాల్గొన్నారు.

నిరాహార దీక్షలో సంఘీభావం తెలుపుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్

క్రైం కార్నర్

శ్రీగంధం స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

కారుతో సహా శ్రీగధం బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు సంచారదళ నిఘా విభాగం డిఎఫ్ఒ ఎం.గురు ప్రభాకర్ తెలిపారు. తమ కార్యాలయానికి అందిన సమాచారం మేరకు చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం, కల్లూరు గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా మంగళవారం అర్ధరాత్రి పీలేరు వైపు నుండి ఓ కారు వేగంగా రావడానికి గుర్తించామన్నారు. తాము కల్లూరు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండడం గమనించిన ఆ కారు డ్రైవర్ చిత్తూరు మార్గంలోకి దూసుకు వెళ్లాడన్నారు. తాము తమ వాహనంలో ఆ కారును వెంబడించగా అతను కారును కల్లూరు నుంచి సదుం రోడ్డుకు మళ్లించి, కల్లూరు ఎగువ వీధి వద్ద వాహనంలోని వ్యక్తి తన వాహనాన్ని ఆపి చీకట్లో ఫరారి అయ్యాడని అన్నారు. తమిళనాడుకు చెందిన ఫోర్డ్ ఎకోస్పోర్ట్ ను తమ సిబ్బంది తనిఖీ చేయగా అందులో 43 కిలోల శ్రీగంధం మూడు బస్తాల్లో తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. కారుతో సహా శ్రీగంధం బస్తాల విలువ సుమారు రూ. 5లక్షలు మతింపు వేయడం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ దాడుల్లో ఎఫ్ఆర్ఓ ఎస్.చంద్రశేఖర్, ఎఫ్‌బిఒ కె.ప్రతాప్, డ్రైవర్లు నందీశ్వరులు,సురేష్ రాజు, ప్రొటెక్షన్ వాచర్లు సుబ్రమణ్యం, చరణ్, వంశీ పాల్గొన్నారు.

తల్లీ, కుమార్తె అదృశ్యం : కేసు నమోదు

ప్రజాశక్తి-కలికిరి : స్థానిక పట్టణంలోని టిబి రోడ్డులో నివాసమున్న షేక్ సర్దార్ భార్య షేక్.మొబుసిరా, కూతురు షేక్ జకియా ఫాతిమా సుమారు వారం రోజుల క్రితం ఇంటి వద్ద నుంచి కనిపించకుండా పోయారని షేక్ సర్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు. మిస్సింగ్‌కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.